



# కరపత్రం

SINCE 2014

శనివారం జూలై 04, 2026 | సంపుటి : 2 | సంచిక : 262 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


## బిఆర్ఎస్ అప్పులు అక్షరాలా

# రూ. 8,21,651 కోట్లు

### అనేక సంస్థలకు వేలకోట్ల బకాయిలు పెట్టిన ఘనులు

- చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు డ్రామాలు
- నాటి అప్పులు, తప్పులపై కెసిఆర్ స్పందించాలి
- హరీష్ రావు అబద్దాలను కట్టిపెడితే మంచిది
- డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క స్ట్రాంగ్ వార్నింగ్



**హైదరాబాద్,జూలై3 :** గత కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో చేసిన భారీ అప్పులు, వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రస్తుతం లేనిపోని అబద్దాలను ప్రచారం చేస్తోందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన తప్పులను తక్కువ చేసి చూపించేందుకు మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ప్రయత్నిస్తున్నారని భట్టి విక్రమార్క అన్నారు. మంత్రిగా పనిచేసిన విషయాన్ని మరిచిపోయి హరీశ్ మాట్లాడుతున్నారని విమర్శించారు. రాష్ట్ర సచివాలయంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై స్పష్టమైన లెక్కలను బయటపెట్టిన ఆయన.. గత పాలకులు రాష్ట్రంపై సుమారు రూ. 8,21,651 కోట్ల అప్పులు , బకాయిల భారాన్ని మిగిల్చారని, వాటిని ప్రస్తుత ప్రభుత్వం ఎంతో శ్రమతో క్రమబద్ధీకరిస్తోందని వెల్లడించారు. అలాగే రెసిడెన్షియల్ పాఠశాలల్లోని పిల్లలకు నాణ్యమైన భోజనం, బట్టలు , కనీస సౌకర్యాలను కల్పించడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, తమ ప్రభుత్వం వచ్చాకే విద్యా సంస్థల్లోని వసతులను మెరుగుపరిచి సంక్షేమానికి పెద్దపీట వేసిందని స్పష్టం చేశారు. సింగరేణి సంస్థపై ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను డీప్యూటీ సీఎం తీవ్రంగా ఖండించారు. బొగ్గు గనుల కేటాయింపులు, ఉత్పత్తికి సంబంధించి గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించి సంస్థను నష్టాల్లోకి నెట్టిందని, ప్రస్తుత ప్రభుత్వం సింగరేణిని కాపాడుకోవడానికి అన్ని రకాలుగా ప్రయత్నిస్తోందని వివరించారు. సింగరేణిలో జరిగిన గత ప్రభుత్వ కాలపు అక్రమ వ్యవహారాలపై తాము విజిలెన్స్ విచారణకు ఆదేశిస్తున్నట్లు ఈ సందర్భంగా భట్టి విక్రమార్క ప్రకటించారు. ఇప్పటికైనా ప్రతిపక్షాలు సోషల్ మీడియాలో, బయటా అబద్ధపు ప్రచారాలు చేయడం మానుకోవాలని హెచ్చరించిన ఆయన, దమ్ముంటే తమతో నేరుగా బహిరంగ చర్చకు రావాలంటూ మాజీ సీఎం కేసీఆర్‌కు సవాల్ విసిరారు.

2లో..



## రాష్ట్రంలో అద్దం లాంటి రోడ్ల నిర్మాణం

- ఈ జూలై నెలలో 10 ప్యాకేజీల పనులు ప్రారంభం
- నల్లగొండ-మహబూబ్ నగర్ రోడ్డు పనుల్లో వేగం పెంచాలి
- వర్షాకాలం పూర్తి అయిన తర్వాత మూడు షిఫ్టుల్లో నిర్మాణ పనులు
- 6న కరీంనగర్ జిల్లా హ్యామ్ రోడ్ల పనులకు శంకుస్థాపన
- హై కోర్టు భవనం,ఉస్మానియా ఆసుపత్రి డిసెంబర్ కల్లా పూర్తి కావాలి
- టిమ్స్,నిమ్స్,వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ పూర్తి చేయండి
- ప్రాజెక్టుల్లో టెక్నికల్ నాలెడ్జ్ ,కమిట్మెంట్ ఉన్న ఇంజనీర్లను నియమించాలి
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవు
- ఆర్ అండ్ బి అధికారులతో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

**హైదరాబాద్,జూలై3 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో 'న భూతో న భవిష్యతి' రీతిలో రాష్ట్రంలో అద్దం లాంటి రోడ్ల నిర్మాణానికి సంకల్పించామని,అందులో భాగంగా జూన్ 28న నల్లగొండ జిల్లా కనగల్ వేదికగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా రాష్ట్ర హ్యామ్ రోడ్ల పనుల పైలాన్ ఆవిష్కరణ చేసుకుని,పనులు ప్రారంభించామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. రానున్న రెండేళ్లలో రాష్ట్రంలో ఏ మూలన చూసిన నాణ్యమైన ఆర్ అండ్ బి డబుల్ రోడ్లు వినియోగంలోకి వస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

మిగతాద్ది 2 లో

# అమర్‌నాథ్ యాత్రికులకు మోడీ శుభాకాంక్షలు



- యాత్రలో పాల్గొనడం గొప్ప అనుభూతిగా వెల్లడి
- యాత్రలో జాగ్రత్తలు పాటించాలంటూ ఎక్స్ వేదికగా పిలుపు

**న్యూఢిల్లీ,జూలై 3 :** అమర్‌నాథ్ యాత్రను పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ భక్తులకు ప్రత్యేక శు భాకాంక్షలు తెలిపారు. ఈ పవిత్ర యాత్రను ఒక 'గొప్ప భాగ్యం'గా అభివర్ణించిన ప్రధాని, భక్తి శ్రద్ధలతో, క్రమశిక్షణతో, బాధ్యతాయుతమైన జాతీయ భావనతో భక్తులు ఈ ప్రయాణాన్ని కొనసాగించాలని కోరారు. శివభక్తులను ఉద్దేశించి రాసిన లేఖను ఎక్స్ వేదికగా పంచుకుంటూ మోదీ పలు కీలక విషయాలను ప్రస్తావించారు.'పవిత్రమైన అమర్‌నాథ్ యాత్రలో పాల్గొనడం ఒక గొప్ప భాగ్యం. ప్రతి సంవత్సరం మంచు లింగంని నేరుగా దర్శించుకునే ఈ అవకాశం లక్షలాది మంది శివభక్తులకు అత్యంత పవిత్రమైన, మరపురాని అనుభూతిని ఇస్తుంది. ఈ సంవత్సరం యాత్రకు సిద్ధమవుతున్న భక్తులందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు.' అని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. ఈ యాత్ర భారతదేశ ఆధ్యాత్మిక సంప్రదాయంలో ఒక శాశ్వతమైన అధ్యాయమని ప్రధాని కొనియాడారు. ప్రపంచవ్యాప్తంగా సనాతన సంస్కృతిని అనుసరించే లక్షలాది మంది భక్తులు ప్రతి ఏటా బాబా అమర్‌నాథ్ ఆశీస్సుల కోసం జమ్మూ కశ్మీర్‌కు వస్తుంటారని గుర్తుచేశారు.

2లో..



2లో..

# అప్పులపై కాంగ్రెస్ ప్రభుత్వం అబద్దాలు

- » పూటకో మాట.. రోజుకో అడ్రస్‌లా జూపల్లి తీరు
- » విమర్శలు గుప్పించిన బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు

**సంగారెడ్డి,జూలై3 :** కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో చేసిన అప్పుల విషయంలో అబద్దాలు చెప్తున్నదని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. సంగారెడ్డిలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అధ్యక్షతన ఎస్ఐఆర్ పై నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు.

### కాంగ్రెస్, బిఆర్ఎస్

## నేతల నటన అద్భుతం

» కేంద్రమంత్రి బండి సంజయ్ ఎద్దేవా

**హైదరాబాద్,జూలై3 :** కాంగ్రెస్, భారాస నేతల నటన అద్భుతంగా ఉందని, బిగ్‌బాస్ షోను తలపిస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ గురువారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు.



2లో..



## రండి అప్పులు సంగతి తేలుస్తా

- అబద్దాలతో ప్రజలను మభ్య పెట్టలేరు
- మరోమారు హరీష్ రావుకు జూపల్లి సవాల్

**హైదరాబాద్,జూలై3:** తెలంగాణ అప్పులపై మంత్రి జూపల్లి కృష్ణారావు చర్చకు మరోమారు సిద్ధమయ్యారు. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో చర్చకు సిద్ధమని.. సాయంత్రం 5 గంటలకు వస్తానని బీఆర్ఎస్ నేతలకు మరోసారి సవాల్ విసిరారు. 'మీరు సిద్ధమైతే ముందే చెప్పండి. నా లెక్కలు తప్పు అయితే రాజీనామా చేస్తా. మీ లెక్కలు తప్పు అయితే రాజీనామా చేస్తారా? బీఆర్ఎస్ పార్టీని రద్దు చేస్తారా? కేసీఆర్ రాకపోతే జూపల్లి చెప్తున్న లెక్కలు తప్పని మీడియాతో చెప్పమనండి.

మిగతాద్ది 2 లో

## సవాళ్లు విసరడం..పారిపోవడం అలవాటే

- » రేంవత్, మంత్రుల తీరే ఇందుకు నిదర్శనం
- » మాజీమంత్రి వేముల ప్రశాతంత్ రెడ్డి విమర్శలు



2లో..

**హైదరాబాద్,జూలై 3 :** ప్రతిపక్ష పార్టీలకు సవాల్ విసరడం, పారిపోవడం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వెన్నతో పెట్టిన విద్య అని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శించారు. మంత్రులు కూడా అదేతరహాలో ఉన్నారని మండిపడ్డారు. ఇందుకు తాజాగా మంత్రులు వ్యయహరించిన తీరే నిదర్శనమని అన్నారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులకు సవాల్ విసిరి తోక ముడిచిన కాంగ్రెస్ మంత్రుల డొల్లతనం బయట పడిందని , మంత్రులు పోలీసులను అడ్డంపెట్టుకొని పారిపోయారని ఆరోపించారు.



## ఏపీ, తెలంగాణలో 3 రోజుల పాటు భారీ వర్షాలు

ఉత్తర, పశ్చిమ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో మూడు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్ష కురిసే అవకాశం ఉందని, దక్షిణ, మధ్య తెలంగాణ జిల్లాల్లో తేలిక నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొన్నారు.

**ఆంధ్రప్రదేశ్‌లో..**

వాయవ్య బంగాళాఖాతాన్ని ఆనుకొని ఉన్న ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడిందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఇది రాబోయే రెండు, మూడు రోజుల్లో మరింత బలపడే అవకాశం ఉందన్నారు. గంటకు 40-50 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శుక్రవారం మేఘావృతమైన వాతావరణంతో శ్రీకాకుళం, పోలవరం, కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు, మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించారు.

## మంత్రి కొండా సురేఖతో పిసిసిఎఫ్ వినయ్ కుమార్ భేటీ

- అటవీ సంపద పరిరక్షణ, పచ్చదనంపై కార్యాచరణ ను అమలు చేయాలని నూతన పిసిసిఎఫ్ కు దిశానిర్దేశర
- మాజీ పిసిసిఎఫ్ సువర్ణను చీరతో సత్కరించిన మంత్రి



2లో..



**హైదరాబాద్,జూలై3 :** రాష్ట్ర అటవీదళాల నూతన ప్రధాన సంరక్షణాధికారి (పిసిసిఎఫ్)గా బాధ్యతలు స్వీకరించిన వినయ్ కుమార్ శుక్రవారం అటవీ శాఖ మంత్రివర్యులు శ్రీమతి కొండా సురేఖను జూబ్లీహిల్స్ లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అటవీ సంపద పరిరక్షణ, అటవీ విస్తీర్ణం పెంపు, జీవ వైవిధ్య సంరక్షణ, సామాజిక అటవీ కార్యక్రమాలు, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజల భాగస్వామ్యాన్ని మరింత పెంపొందించడం, ప్రభుత్వ లక్ష్యాలు, అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, తదితర అంశాలపై వీరిరువురు సమగ్రంగా చర్చించారు.



మిగతాది 2లో

## నెల రోజుల పసికందు కిడ్నాప్? కేసు.. 72 గంటల్లో ఛేదన

# రండి అప్పులు సంగతి తేలుస్తా

మొదటిపేజీ తరువాయి

ఖబడ్దార్.. కేసీఆర్, కేటీఆర్, హరీశ్.. పాలమూరు పౌరుషమా? కల్వకుంట్ల పౌరుషమా చూసుకుందాం' అంటూ ఛాలెంజ్ చేశారు. 'నేనెక్కడికీ పారిపోలేదు. పారిపోయే లక్షణం నాకు లేదు. నా మాటకు కట్టుబడి ఉన్నాను. ఆపరేషన్ సక్సెస్, పేషెంట్ డెడ్‌లాగా కేటీఆర్, హరీశ్ వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర అప్పు రూ.3,17,015 కోట్ల అని ఒకసారి, రూ.3,85,045 కోట్లు అని మరోసారి అసెంబ్లీలో కేటీఆర్ అన్నారు. రాష్ట్ర అప్పు రూ.4, 26,499 కోట్లు అని ఒకసారి.. రూ.4,17, 496 కోట్లు అని మరోసారి హరీశ్ అసెంబ్లీలో అన్నారు. కేసీఆర్ దిగిపోయే సరికి రూ.8,21, 651 కోట్ల అప్పు ఉంది. నేను చెప్తున్న లెక్కలు తప్పు అయితే మంత్రి పదవికి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని తాజాగా సవాల్ చేశారు. కార్పొరేషన్ ద్వారా తెచ్చిన అప్పులను కేటీఆర్, హరీశ్ ఎందుకు చెప్పడం లేదు. మిషన్ భగీరథ కోసం తెచ్చిన అప్పులు ప్రజలు కడతారా?' అంటూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అబద్దాలు చెప్పే వాడిని కాదని మంత్రి తెలిపారు. ఆత్మ గౌరవం కోసం ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేశానని గుర్తుచేశారు. ఉద్యోగానికి రాజీనామా చేసి వ్యవసాయం చేసుకునే వాడినని తెలిపారు. రాజకీయాల నుంచి వ్యాపారంలోకి రాలేదని.. వ్యాపారం చేసి రాజకీయాల్లోకి వచ్చినట్లు జూపల్లి కృష్ణారావు వెల్లడించారు.

## అప్పులపై కాంగ్రెస్ ప్రభుత్వం అబద్దాలు

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ ఏర్పడిన తరువాత రాష్ట్రంలో చేసిన అప్పు రూ. 1,77,058 కోట్లు అని మంత్రి జూపల్లి కృష్ణారావు నాకు లేఖ రాశాడు. కానీ రేవంత్ రెడ్డి నాలుగు నెలల క్రితం అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అప్పు రూ.3,45,294 కోట్లు అని చెప్పాడు. నాలుగు నెల కిందనే నిండు అసెంబ్లీలో రేవంత్ రెడ్డి అంత చెప్పాడు అంటే ఈ నాలుగు నెలలది కూడా కలిపితే రూ. 4 లక్షల కోట్లు దాటుతుందన్నారు. జూపల్లి ఒక మాట చెబుతున్నాడు, రేవంత్ రెడ్డి ఇంకో మాట చెబుతున్నాడు. ఇప్పుడు రాజీనామా ఎవరు చేయాలి? అని హరీశ్ రావు సూటిగా ప్రశ్నించాడు. పూటకో సవాల్.. రోజుకో అడ్రస్‌లా మంత్రి జూపల్లి కృష్ణారావు తీరు ఉందని హరీశ్‌రావు విమర్శించారు. మంత్రి జూపల్లి సవాళ్లు నిన్నే చూశాం.. ఏమైందో అందరికీ తెలుసు. తెలంగాణ భవన్‌కు వస్తానని చెప్పింది ఆయనే. వెంటనే మాట మార్చి గన్‌పార్క్‌కు వెళ్లారు. గన్‌పార్క్‌కు వెళ్లకుండా పోలీసులు

మమ్మల్ని అడ్డుకున్నారు. చర్చకు కేసీఆర్ రావాలని ఇప్పుడు అంటున్నారు. జూపల్లి వాట్సప్‌లో లేఖ పెట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక వాళ్లు చేసిన అప్పులు లేఖలో రాశారు. తాము వచ్చాక రూ.1.77లక్షల కోట్లు అప్పు చేశామని జూపల్లే చెప్పారు. ఆర్‌బీఐ వద్ద తెచ్చిన ఎఫ్ఆర్‌బీఎం అప్పులు మొత్తం చెబుతా. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అప్పు రూ.1.86లక్షల కోట్లు. ఆర్‌బీఐ తెచ్చిన అప్పులోనే తేడాలు చెప్పారు. ఏం చేయాలో అర్థంకాక డ్యామేజ్ కంట్రోల్ చేసుకుంటున్నారు' అని హరీశ్‌రావు విమర్శించారు.

# అమర్‌నాథ్ యాత్రికులకు మోడీ శుభాకాంక్షలు

మొదటిపేజీ తరువాయి

వివిధ ప్రాంతాలు, విభిన్న భాషలు, భిన్నమైన ఆచారాలు ఉన్నప్పటికీ.. మహాదేవుని ఆశీస్సులు పొందాలనే ఒకే ఒక సంకల్పంతో భక్తులంతా ఇక్కడికి తరలివస్తారని, ఈ రెండు నెలల కాలంలో బాబా బర్ఫానీ పవిత్ర సన్నిధిలో భారతదేశ 'భిన్నత్వంలో ఏకత్వం' అనే అద్భుత దృశ్యం ఆవిష్కృతమవుతుందని మోదీ అన్నారు. ఈ యాత్ర సజావుగా సాగడానికి అహర్నిశలు శ్రమిస్తున్న భారత సైన్యం, సీఆర్‌పీఎఫ్, జమ్మూ కశ్మీర్ పోలీస్, ఐటీబీపీ, బీఎస్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందితో పాటు ఆరోగ్య కార్యకర్తలు, పరిపాలనా అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు, వాలంటీర్లకు ప్రధాని మోదీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఏడాది యాత్ర సందర్భంగా భక్తులందరూ తమ జీవితంలో ఐదు ముఖ్యమైన సంకల్పాలను స్వీకరించాలని ప్రధాని పిలుపునిచ్చారు. అమర్‌నాథ్ యాత్ర మార్గంలో ఎక్కడా చెత్తాచెదారం వేయకుండా, పరిశుభ్రత నియమాలను తూచా తప్పకుండా పాటించాలన్నారు. వాతావరణ మార్పులు, వర్షాల నేపథ్యంలో జారే మార్గాల పట్ల అప్రమత్తంగా ఉంటూ, పరిపాలనా యంత్రాంగం ఇచ్చే ఆదేశాలను, ట్రాఫిక్ నిబంధనలను, భద్రతా సూచనలను పూర్తిగా అంకితభావంతో పాటించాలని సూచించారు. స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు, యాత్రికులు తమ ప్రయాణ ఖర్చులలో కనీసం 10 శాతం మొత్తాన్ని జమ్మూ కశ్మీర్‌లోని స్థానిక ఉత్పత్తులను కొనుగోలుకు కేటాయించాలి. ఇది అక్కడి కుటుంబాలకు, యువతకు ఉపాధినిస్తుందన్నారు. రక్షాబంధన్ పండుగతో ముగిసే ఈ యాత్ర ముగింపు సందర్భంగా.. 'ఏక్ పేడ్ మా కే నామ్' అమ్మ పేరిట ఒక మొక్క ప్రచారంలో భాగంగా ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలన్నారు. దేశమే ప్రథమమనే భావనతో, మన బాధ్యతలను ఏడాది పొడవునా నిజాయితీగా నిర్వర్తిస్తూ, 'వికసిత్ భారత్' నిర్మాణంలో చురుకైన పాత్ర పోషించాలి. చివరగా, భక్తులందరి ప్రయాణం సుఖమయంగా, సురక్షితంగా, ఆధ్యాత్మికంగా సాగాలని ప్రధాని ఆకాంక్షించారు.

## నెల రోజుల పసికందు కిడ్నాప్? కేసు.. 72 గంటల్లో ఛేదన

మొదటిపేజీ తరువాయి

నెలరోజుల పసికందు కిడ్నాప్ కేసును సైబరాబాద్ చందానగర్ పోలీసులు 72గంటల్లో ఛేదించారు. ఈ సందర్భంగా శుక్రవారం సైబరాబాద్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపి రమేష్ రెడ్డి కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.గత నెల 30వ తేదీ అర్ధరాత్రి అనంతరం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో లింగంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో నిద్రిస్తున్న మహిళ వద్ద నుంచి నెల రోజుల వయస్సు గల ఆడశిశువును కిడ్నాప్ చేసిన ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి..

ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా తప్పిపోయిన, కిడ్నాప్‌కు గురైన చిన్నారులను గుర్తించి వారి కుటుంబాలకు అప్పగించే క్రమంలో ఈ కేసును అత్యంత ప్రాధాన్యంగా తీసుకొని కేవలం 72 గంటల్లోనే కేసును ఛేదించి పాపను సురక్షితంగా రక్షించారు.

పశ్చిమ బెంగాల్‌కు చెందిన సాధిక మక్సూద్ అనే మహిళకు సంతానం లేకపోవడంతో పాపను అక్రమంగా తెప్పించుకునేందుకు కుట్ర పన్నినట్లు గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. 'ఆమె బ్యూటీ పార్లర్‌లో పనిచేస్తున్న నిమ్మి జహాన్, రహనుమా అలీల సహాయం కోరింది. లింగంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో రోడ్డుపై నిద్రిస్తున్న కర్ణాటక కు చెందిన కుటుంబం వద్ద నుంచి పసికందును ఎత్తుకెళ్లి ఆటోలో ఎత్తుకెళ్లారు. ఈ శిశు వును తీసుకురావడానికి కిడ్నాపర్లకు సాధిక మక్సూద్ రూ.1.50 లక్షలు చెల్లించినట్లు విచారణలో తేలింది. అనంతరం పాపతో కలిసి కోల్‌కతాకు వెళ్లేందుకు రైల్వే టికెట్లు కూడా బుక్ చేసుకున్నప్పటికీ, వేగంగా స్పందించి వారిని అదుపులోకి తీసుకుని పాపను రక్షించాం' అని తెలిపారు.ఈ కేసులో ఏ1 మొహమ్మద్ జుబేర్, ఏ2 మొహమ్మద్ ఇర్ఫాన్, ఏ3 సాధిక మక్సూద్, ఏ4 నిమ్మి జహాన్, ఏ5 రహనుమా అలీలను అరెస్ట్ చేసామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ క్రైమ్స్ శ్రీనివాస్, ఆర్ సి పురం ఏసీబీ వై శ్రీనివాస్ రావు, చందానగర్ సిఐ విజయ్ కుమార్, అమీన్పూర్ డిఐ భాస్కర్ తో పాటు పలువురు సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# సవాళ్లు విసరడం..పారిపోవడం అలవాటే

మొదటిపేజీ తరువాయి

గతంలో సవాల్ చేసిన రేవంత్ రెడ్డి ప్రెస్‌క్లబ్‌ను కల్లు కాంపౌండ్‌తో పోల్చి పారిపోగా , కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని చెప్పి మూడు నెలల్లోనే మల్కాజీగిరి ఎంపీగా పోటీ చేశారని ఎద్దేవా చేశారు.ఉద్యమం జరిగినప్పుడు గుర్తుకు రాని గన్‌పార్క్ కాంగ్రెస్ మంత్రులకు ఇప్పుడు గుర్తొచ్చిందా ? అంటు ప్రశ్నించారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై మంత్రులు అహంకారంతో మాట్లాడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం వద్ద సమాధానం లేనప్పుడే ప్రతిపక్ష నాయకులను అరెస్టులు చేస్తారని మండిపడ్డారు. ఏదేని సమస్యపై రేవంత్ రెడ్డి డిఫెన్స్ లో పడగానే బండి సంజయ్ తెరపైకి వస్తాడని, బండి సంజయ్ డిఫెన్స్ లో పడగానే ముఖ్యమంత్రి తెరపైకి వస్తాడని విమర్శించారు. అమృత్ టెండర్ లో ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డి కుంభకోణంపై కేంద్రానికి లేఖ రాస్తే చర్యలు ఎందుకు తీసుకోలేదని వేముల ప్రశ్నించారు. బొగ్గు కుంభకోణం జరిగిందని కేంద్రానికి లేఖ రాస్తే ఇంతవరకు చర్యలే లేవని అన్నారు. కేటీఆర్ హరీష్ రావు సెగకు మంత్రులు ఒక్కొక్కరు బయటకు వస్తున్నారని, ఇక ముందు ఇలాంటివి చాలా జరుగుతాయని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకుల ఆరోపణలతో సింగరేణిలో బొగ్గు మాయం పై మంత్రి భట్టి విజిలెన్స్ విచారణకు ఆదేశించారని వెల్లడించారు. అప్పులపై, గురుకులాల్లో జరిగిన అవినీతిపై చర్చకు స్వయంగా సవాల్ విసిరిన కాంగ్రెస్ మంత్రులు, చర్చకు హాజరు కాకుండా వెనక్కి పారిపోవడం వారి పిరికితనానికి నిదర్శనం అన్నారు. చర్చ కోసం తెలంగాణ భవన్‌కు చేరుకున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను, ఘన్ పార్క్‌కు బయలుదేరిన మాజీ మంత్రి హరీష్ రావును, అలాగే ఇతర ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, శ్రీనివాస్ గౌడ్‌లను వందలాది మంది పోలీసులతో అడ్డుకోవడం, నిర్బంధించడం, అరెస్టు చేయడం ప్రజాస్వామ్యాన్ని అవమానపరచడమేనని అన్నారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ, కక్షసాధింపు పాలనకు పరాకాష్ట అన్నారు. అప్పులపై నిజంగా చర్చించే ధైర్యం ఉంటే పూర్తి స్థాయిలో అసెంబ్లీలో చర్చ నిర్వహించాలి. చర్చ కు కేసీఆర్ అవసరం లేదు. ఎంతమంది మంత్రులు వచ్చినా కేటీఆర్, హరీష్ రావు లెక్కలతో సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారు. చర్చకు రమ్మని సవాల్ విసిరి, చర్చకు వచ్చిన ప్రతిపక్ష నాయకులను పోలీసులతో అడ్డుకోవడం ద్వారా కాంగ్రెస్ మంత్రులు భయపడి పారిపోయారనే విషయం స్పష్టమైంది.సవాల్ విసరడం, చివరకు తోక ముడవడం కాంగ్రెస్ మంత్రులకు అలవాటుగా మారింది. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ సతీమణిని అఘామేఘాల మీద ప్రాధాన్యత లేని శాఖలకు బదిలీ చేయడం ప్రభుత్వం ఎంత భయపడుతోందో వెల్లడిస్తోంది. ఇవన్నీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగమేనని అన్నారు. తెలంగాణ భవన్‌కు వస్తానని చెప్పిన మంత్రి జూపల్లి కృష్ణారావు భవన్ కి రాకుండా ఘన్ పార్క్ కి రమ్మంటే అక్కడికి కుడా వద్దకు వెళ్లేందుకు బయలుదేరిన కేటీఆర్‌ను కూడా పోలీసులతో అడ్డుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని బయటపెడుతోంది. బిఆర్ఎస్ నాయకులు పై అక్రమ కేసులు, అరెస్టులు, నిర్బంధాలతో భయపెట్టాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఎన్ని నిర్బంధాలు చేసినా, ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ఆపేది లేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో పూర్తిగా విఫలమయ్యారు. రాష్ట్ర సమస్యలను పరిష్కరించడంలో చేతులెత్తేసి, రాజకీయ కక్షసాధింపులకే పరిమితమయ్యారు. కాంగ్రెస్ మంత్రులు ప్రజా పాలనను గాలికి వదిలేసి అవినీతిలో మునిగిపోయారని వేముల విమర్శలు గుప్పించారు.

# రాష్ట్రంలో అద్దం లాంటి రోడ్ల నిర్మాణం

మొదటిపేజీ తరువాయి

'మంచి రోడ్డు – ప్రగతికి సూచిక' అని తాను బలంగా విశ్వసిస్తానని, దీంతో ప్లలె పట్టణాలకు కనెక్టివిటీ పెరిగి,గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు వస్తె స్థానికంగానే ఉద్యోగ,ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పలు పనుల పురోగతిపై డా.బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సెక్రటేరియట్ లో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆ శాఖ ఉన్నతాధికారులతో సుదీర్ఘ సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఆర్ అండ్ బి లోని విభాగాల వారీగా పనుల పురోగతిపై కూలంకషంగా చర్చించిన మంత్రి,చేపట్టిన కీలక పనులు ఏ దశల్లో ఉన్నాయో అధికారులను ఆరా తీశారు. మొదటి ఫేజ్ లో సుమారు 13వేల కోట్లతో 6092 కి.మీ రోడ్ల పనులు 34 ప్యాకేజీల్లో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనుండగా..ఈ జూలై నెలలోనే 10 ప్యాకేజీల పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ప్యాకేజ్-2లో సుమారు 155 కోట్ల అంచనా వ్యయంతో 42కి.మీ పొడవుగల నల్లగొండ-మహబూబ్ నగర్ డబుల్ రోడ్డు పనులు ఇప్పటికే ప్రారంభమైన నేపథ్యంలో పనుల్లో వేగం పెంచాలన్నారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు ఆశించిన స్థాయిలో లేవని,అయినా..

వర్షాకాలం పూర్తి అయిన తర్వాత మూడు షిఫ్టుల్లో రోడ్ల నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. రోడ్ల నిర్మాణం కోసం నిష్ణాతులై, నిరంతరం ఫీల్డ్ లో ఉండే ఇంజనీర్లను ఎంపిక చేసి,ప్యాకేజీల వారిగా పనుల బాధ్యతలు అప్పజెప్పాలని,పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయించడం చీఫ్ ఇంజనీర్ల బాధ్యతేనని మంత్రి స్పష్టం చేశారు. ఈనెల 6న కరీంనగర్ జిల్లాలో చేపట్టే హ్యామ్, రోడ్ల పనులకు ఆ జిల్లా మంత్రులు,స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. అందుకు సంబంధిత ఏర్పాట్లు చూడాలని సి.ఈ లు బి.వి రావు,వసంత్ నాయక్ లను మంత్రి ప్రత్యేకంగా ఆదేశించారు. ÷ూజేంద్ర నగర్ లో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న నూతన హై కోర్టు భవనం,జడ్జిల నివాస సముదాయ భవనాల నిర్మాణాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని,నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన జరగాలని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు 16 శాతం పనులు పూర్తయ్యాయని సి.ఈ లు రాజేశ్వర్ రెడ్డి, నర్సింగ్ రావు వివరించగా....మూడు షిఫ్టుల్లో నిర్మాణ పనులు జరగాలని,అందుకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచి, నిర్మాణ సంస్థతో సమన్వయం చేసుకుంటూ పనుల్లో వేగం పెంచాలని మంత్రి వారిని ఆదేశించారు. అక్కడ ఆర్ అండ్ బి తరుపున నిర్మాణ పర్యవేక్షణ బాధ్యతలు చూస్తున్న ఇంజనీర్ల సంఖ్యను పెంచాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ 2027 డిసెంబర్ నాటికి ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. అట్లాగే ఉస్మానియా జనరల్ ఆసుపత్రి పనుల్లో ఇంకా వేగం పెరగాలని,ఇది కూడా డిసెంబర్ 2027 వరకు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. సనత్ నగర్ టిమ్స్ ప్రారంభానికి సిద్ధం అయిందని,అల్వాల్, ఎల్బీనగర్ టిమ్స్, నిమ్స్ విస్తరణ,వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ నిర్మాణ పనులు వేగవంతం చేసి అతి త్వరలో ప్రజలకు అందుబాటులోకి వచ్చే విధంగా పని చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం

ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ ప్రాజెక్టుల్లో టెక్నికల్ నాలెడ్జ్ ఉండి,మనసుపెట్టి పనిచేసే కమిట్మెంట్ ఉన్న ఇంజనీర్లను నియమించాలనీ మంత్రి సూచించారు. ఈ వారం నుండే నిర్మాణం జరుగుతున్న ప్రాంతాల్లో ఆకస్మిక సైట్ విజిట్స్ చేస్తానని..పనుల పురోగతిలో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తన దృష్టికి వస్తే, ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోనని,కఠిన చర్యలు తప్పవని సున్నితంగా హెచ్చరించారు. బాసర,భద్రాచలం ఆలయ నిర్మాణ పనుల పురోగతి,గోదావరి పుష్కరాల కోసం ఆర్ అండ్ బి ఏర్పాట్లపై మంత్రి ఆరా తీశారు..సంబంధిత ఆయా శాఖలతో సమన్వయం చేసుకుంటూ ఆర్ అండ్ బి తరుపున నిర్మాణ పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించుకొని పని చేయాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, ఈఎన్సి జయ భారతి,అన్ని విభాగాల సి.ఈ లు.. బి.వి రావు,రాజేశ్వర్ రెడ్డి,ధర్మారెడ్డి, వసంత్ నాయక్,వనజ,రాజేందర్,నర్సింగ్ రావు పలువురు ఆర్ అండ్ బి ఇంజనీర్లు పాల్గొన్నారు.

## మంత్రి కొండా సురేఖతో పిసిసిఎఫ్ వినయ్ కుమార్ భేటీ

మొదటిపేజీ తరువాయి

అటవీ సంపదను భవిష్యత్ తరాలకు అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్య సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ విధానాలను సమర్థవంతంగా అమలు చేయాలని మంత్రి సురేఖ పిసిసిఎఫ్ కు సూచించారు. అటవీ శాఖ కార్యక్రమాల అమలులో సాంకేతికత వినియోగం, అటవీ రక్షణ చర్యల బలోపేతం, పచ్చదనం పెంపుదల, అటవీ అభివృద్ధికి సంబంధించిన కార్యాచరణను మరింత వేగవంతం చేయాలని మంత్రి వినయ్ కుమార్ కు దిశానిర్దేశర చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశిరచిన లక్ష్యాల సాధనకు అటవీ శాఖ పూర్తి నిబద్ధతతో పనిచేస్తుందని పీసీసీఎఫ్ వినయ్ కుమార్ ఈ సందర్భంగా మంత్రికి హామీ ఇచ్చారు. అడవుల సంరక్షణకు అహర్నిశలు కృషి చేస్తూ, అటవీ సంపదను కాపాడుతున్న అటవీ అధికారులు, సిబ్బందికి ప్రతి ఏటా అవార్డులు, నగదు ప్రోత్సహకాలు అందించేలా చర్యలు చేపట్టినందుకు గాను పిసిసిఎఫ్ వినయ్ కుమార్ మంత్రి సురేఖ గారికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ అటవీ రంగంలో ఈ చర్య మైలురాయిగా నిలుస్తుందని, అటవీ సిబ్బంది సేవలకు ప్రభుత్వం ఇస్తున్న గౌరవానికి ఇది నిదర్శనమని ఆయన అన్నారు. పదవీ విరమణ తర్వాత తనను మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ పిసిసిఎఫ్ సువర్ణను మంత్రి కొండా సురేఖ చీరతో సత్కరించి, అభినందించారు. అటవీ శాఖకు ఆమె అందించిన విశిష్ట సేవలను కొనియాడారు. పదవీవిరమానంతర జీవితం సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు.

## కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో జాతీయ సదస్సు

భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో నిర్వహించిన ఒకరోజు మీడియా / కమ్యూనికేషన్ నోడల్ అధికారుల జాతీయ సదస్సులో తెలంగాణ రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖకు చెందిన జిల్లా పౌర సంబంధాల అధికారులు, మీడియా నోడల్ అధికారులు, సోషల్ మీడియా నోడల్ అధికారులు పాల్గొన్నారు. దేశంలోని 15 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన సుమారు 240 మంది జిల్లా పౌర సంబంధాల అధికారులు హాజరైన ఈ సదస్సులో ఎన్నికల నిర్వహణలో కమ్యూనికేషన్ పాత్ర, మీడియా నిర్వహణ, ఎన్నికల చట్టాలు, డిజిటల్ సాంకేతికత వినియోగం, తప్పుడు ప్రచారాల నియంత్రణ, సోషల్ మీడియా సవాళ్లు, ఎన్నికల సమాచారాన్ని ప్రజలకు వేగంగా చేరవేసే విధానాలపై ఎన్నికల సంఘం అధికారులు సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ మాట్లాడుతూ, స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక, పారదర్శక ఎన్నికల నిర్వహణలో మీడియా, ప్రజా సంబంధాల అధికారుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ఎన్నికల సంఘం విడుదల చేసే అధికారిక సమాచారాన్ని ప్రజలకు వేగంగా చేరవేయడంతో పాటు తప్పుడు ప్రచారం, అపోహలు, దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాల్సిన బాధ్యత కమ్యూనికేషన్ అధికారులపై ఉందని పేర్కొన్నారు. ÷-రత్యేక ఓటరు జాబితా సవరణ సర్ పక్రియ ప్రాధాన్యాన్ని వివరిస్తూ, పౌరసత్వ చట్టం-1955 నిబంధనలకు అనుగుణంగా అర్హులైన భారతీయ పౌరుల పేర్లు మాత్రమే ఓటరు జాబితాలో ఉండేలా ఈ పక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల పక్రియపై ప్రజల్లో అపోహలు తొలగించి వాస్తవాలను చేరవేయడంలో మీడియా, ప్రజా సంబంధాల అధికారుల పాత్ర అత్యంత ముఖ్యమని చెప్పారు. సదస్సులో ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, ఫారం-17సీ, ఆర్టికల్-324 కింద ఎన్నికల సంఘానికి ఉన్న అధికారాలు, ఎన్నికల ప్రచార నిబంధనలు, పెయిడ్ న్యూస్ నియంత్రణ, సోషల్ మీడియా, కృత్రిమ మేధ వల్ల ఎదురవుతున్న సవాళ్లు, వాటిని ఎదుర్కొనే వ్యూహాలపై ఎన్నికల సంఘం సీనియర్ అధికారులు ప్రత్యేక ప్రజెంటేషన్లు ఇచ్చారు.

## బిఆర్ఎస్ అప్పులు అక్షరాలా రూ. 8,21,651 కోట్లు

మొదటిపేజీ తరువాయి

బీఆర్ఎస్ పాలనలో చేసిన అప్పులపై కేసీఆర్ స్పందించాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో మొత్తం అప్పు రూ.8.21 లక్షల కోట్లు అని.. మొత్తం అప్పుల్లో గత ప్రభుత్వ బకాయిలు ఉన్నాయని తెలిపారు. అప్పులు అన్నీ వాస్తవాలు కాదా.. వీటిని ఎవరు చెల్లిస్తారని ప్రశ్నించారు. అప్పులపై కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అప్పులను తక్కువ చేసి చూపేందుకే కేటీఆర్, హరీశ్ ప్రయత్నిస్తున్నారని ఉపముఖ్యమంత్రి మండిపడ్డారు. మంత్రిగా పనిచేశానని మర్చిపోయి మరీ హరీశ్ మాట్లాడుతున్నారని.. అనేక అంశాలపై అబద్దాలు చెబుతున్నారని వ్యాఖ్యానించారు. వాస్తవాలను ప్రజల దృష్టికి తేవాలన్నారు. బీఆర్ఎస్ నేతల అబద్దాలు ప్రజల్లోకి వెళ్లకూడదన్నారు. సోషల్ మీడియా ద్వారా అబద్ధపు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అబద్దాల పునాదులపై పదేళ్లు పరిపాలించారని.. బీఆర్ఎస్ చేసిన అప్పులతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని విరుచుకుపడ్డారు. అప్పుల భారం రాష్ట్రంపై వేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. బుకాయింపులు, అసత్యాలతో ఎన్నాళ్లు మోసం చేస్తారంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్‌రావు అనేక విషయాలపై అబద్దాలు చెబుతున్నారు. వాస్తవాలను ప్రజల దృష్టికి తీసుకురావాలి. బీఆర్ఎస్ నేతలు చెప్పే అవాస్తవాలు ప్రజల్లోకి వెళ్లకూడదు. సోషల్ మీడియా వ్యవస్థల ద్వారా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. అబద్దాల పునాదులపై పదేళ్లపాటు పరిపాలన చేశారు. బీఆర్ఎస్ నేతలు కావాలనే ప్రభుత్వంపై పదేపదే దుష్ప్రచారం చేస్తున్నారు. ఆ పార్టీ హయాంలో చేసిన అప్పులతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. పదేళ్లు సీఎంగా పనిచేసిన కేసీఆర్‌కు సవాల్ విసురుతున్నాం. 2014 నుంచి 2023 వరకు అప్పులు చేసి రాష్ట్రంపై పెనుభారం వేసింది నిజం కాదా? వివిధ మార్గాల ద్వారా మీరు చేసిన అప్పు రూ.8.21లక్షల కోట్లు. బుకాయింపులు, అసత్యాలతో ఎన్నాళ్లు మోసం చేస్తారు?అప్పుల అంశంపై నిత్యం మాట్లాడితే రాష్ట్రం పరువు పోతుందని తగ్గాం. మేం వచ్చాక రూ.2.08లక్షల కోట్లు చెల్లించాం. 10 శాతం వడ్డీకి కూడా మీరు అప్పులు తెచ్చారు. కట్టాల్సిన వడ్డీని రూ.34 వేల కోట్ల నుంచి రూ.11వేల కోట్లకు తగ్గించాం. బీఆర్ఎస్ నేతలు అడ్డగోలుగా మాట్లాడుతున్నారు. సింగరేణిపై ప్రతిరోజూ అబద్దాలు చెబుతున్నారు' అని భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు.

## కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతల నటన అద్భుతం

మొదటిపేజీ తరువాయి

ప్రజలు మీ నాటకాలు చూసి నవ్వుకుంటున్నారు. అబద్దాలకు ఆస్కార్ అవార్డు ఇస్తే రెండు పార్టీలూ అర్హత సాధిస్తాయని అన్నారు. గురుకులాల టెండర్లు, తెలంగాణ అప్పులతోపాటు అవినీతి, అక్రమాలపైనా చర్చిద్దాం రండి. మా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఆధ్వర్యంలో తేదీ, సమయం, వేదిక నిర్ణయిస్తాం. కాంగ్రెస్, భారాస పాలనా వైఫల్యాలను ప్రజల ముందుంచేందుకు మేం సిద్ధం. మోదీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి ఖర్చు చేసిన నిధులు, అందించిన సంక్షేమ కార్యక్రమాలపైనా చర్చిద్దాం. తెలంగాణలోనూ డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని సంజయ్ అన్నారు.

# బండి సంజయ్ కి ప్రమోషన్!

# నితిన్ నవీన్ కొత్త టీం సిద్ధం..!

గజెల్లి రాజేంద్ర ప్రసాద్,సోషల్ అనలిస్ట్

▪ తెలంగాణలో బిజెపి ప్రత్యర్థులు బండి సంజయ్ ను మరింత బలంగా మార్చుతున్నట్టు అనిపిస్తున్నది.

**భారతీయ జనతా పార్టీ కేంద్ర ప్రభుత్వంలో.. పార్టీలో సమూల ప్రక్షాళన దిశగా కసరత్తు జరుగుతున్నట్టుగా వస్తున్న వార్తల నేపథ్యం లో ఈ ఊహాగానాలు నిజమవుతున్నట్టు అనిపిస్తున్నది.**

ఈ నెల 20 నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం లోగా నిర్ణయాలు అమలు చేసేందుకు సమాయత్తం అవుతున్నారు.

అందులో భాగంగా యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని డిసైడ్ అయ్యారు.

▪ తెలుగు రాష్ట్రాల నుంచి బీజేపీ నేతలకు కొత్త బాధ్యతలు దక్కే అవకాశం కనిపిస్తోంది.

పార్టీలో- మంత్రివర్గంలో తెలుగు రాష్ట్రాలకు ప్రాధాన్యత దక్కే విధంగా కసరత్తు కొనసాగుతోంది. దీనికొరకు ప్రధాని మోదీ కీలక నిర్ణయాలకు సిద్ధమయ్యారు.

బీజేపీ కొత్త జాతీయ కార్యవర్గం ఏర్పాటు పై కీలక మంత్రాంగం కొనసాగుతోంది.

▪ **తాజాగా పార్టీ చీఫ్ నితిన్ నబీన్.. తాజాగా అమిత్ షా నివాసంలో సుమారు మూడు గంటల పాటు సమావేశం అయ్యారు. ఈ సమావేశానికి బీజేపీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ కూడా హాజరయ్యారు. పార్టీ సంస్థాగత వ్యవహారాల్లో కీలక పాత్ర పోషిస్తున్న ఈ ముగ్గురు నేతల మధ్య జరిగిన చర్చల్లో కొత్త కేంద్ర బృందం రూపకల్పనతో పాటు భవిష్యత్ రాజకీయ వ్యూహాలపై కూడా సమగ్రంగా చర్చించినట్లు సమాచారం.**

నితిన్ నబిన్ నేతృత్వంలోని కొత్ టీంలో అనుభవజ్ఞులైన సీనియర్ నేతలతో పాటు యువ నాయకులకు కూడా ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వంలో వివిధ పదవుల్లో ఉన్న కొందరు నేతలను సంస్థాగత బాధ్యతల కోసం తిరిగి పార్టీలోకి తీసుకువచ్చే అవకాశాలపైనా సమావేశంలో చర్చ జరిగినట్లు తెలుస్తోంది.

తెలుగు రాష్ట్రాలకు ప్రాధాన్యత కొందరు మంత్రులకు జాతీయ స్థాయిలో కీలక బాధ్యతలు




అప్పగించే అంశం పైనా ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.

అదే విధంగా పార్టీ పార్లమెంటరీ బోర్డు, కేంద్ర ఎన్నికల కమిటీ, జాతీయ కౌన్సిల్ లోనూ కీలక మార్పులు జరగనున్నాయి. కీలక పదవుల్లో దక్షిణాది రాష్ట్రాలకు ప్రాధాన్యత దక్కనుంది.

తెలంగాణ నుంచి కిషన్ రెడ్డి, బండి సంజయ్ ప్రస్తుతం కేంద్ర మంత్రులుగా ఉన్నారు. తెలంగాణ నుంచి మరొకరికి కేంద్ర కేబినెట్ లో అవకాశం కల్పించటం ఖాయంగా కనిపిస్తోంది.

అదే సమయంలో బండి సంజయ్ -కిషన్ రెడ్డిలను మంత్రులుగా కొనసాగిస్తూనే పార్టీ బాధ్యతలు కేటాయించనున్నట్లు సమాచారం.

▪ ఇక.. ఏపీ నుంచి పురందేశ్వరికి కొత్త జాతీయ కార్య వర్గంలో కీలక బాధ్యతలు అప్పగించనున్నట్లు తెలుస్తోంది.

▪ **కర్ణాటక నుంచి విజయేంద్ర, తమిళ నాడు నుంచి మురుగన్, కేరళ నుంచి రాజీవ్ చంద్రశేఖర్ లకు జాతీయ టీంలో కొత్త బాధ్యతలు అప్పగించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. కొత్త కార్యవర్గం పై వచ్చే వారం అధికారిక ప్రకటన చేసే అవకాశం కనిపిస్తోంది.**

తెలంగాణలో బండి సంజయ్ కుమారుడు భగీరత్ వ్యవహారంలో జరిగిన అలజడిపై కేంద్ర బిజెపి నాయకత్వం స్పష్టమైన వైఖరి కలిగి ఉంది.

తెలంగాణలో బిజెపి నాయకుడిగా ఎదిగి నిలుచున్న బండి సంజయ్ వ్యక్తిగత పనితీరు పట్ల పార్టీ నాయకత్వానికి సానుకూల దృక్పథం ఉన్నట్టు కనిపిస్తున్నది.

బండి భగీరత్ వ్యవహారాన్ని అడ్డం పెట్టుకుని బి.ఆర్.ఎస్ పార్టీ చేసిన వీరంగం చూసిన బిజెపి నాయకత్వం తగిన రీతిలో జవాబు ఇవ్వబోతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వ మంత్రివర్గంలో బండి సంజయ్ ను కొనసాగించడం తో పాటు,మరింత బాధ్యత పెంచి బండి సంజయ్ నుండి మరింత సేవలను పార్టీ ఆశిస్తున్నట్టుగా అనిపిస్తున్నది.

▪ **మొత్తానికి బిజెపి ప్రత్యర్థులు బండి సంజయ్ ను మరింత బలంగా మార్చుతున్నారని రాజకీయ పండితులు అంటున్నారు.**

## జమ్మికుంట నూతన తహసీల్దార్ గడ్డం సుధాకర్‌కు ఘన సన్మానం

గౌన్లవానీకుంట పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేత

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జూలై 3:**
జమ్మికుంట నూతన తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన గడ్డం సుధాకర్‌ను జమ్మికుంట మున్సిపాలిటీ 5వ వార్డు కౌన్సిలర్ యాట్ల సునీత అశోక్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సన్మానించారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి నూతన బాధ్యతల్లో విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ యాట్ల సునీత అశోక్, 5వ వార్డులోని గౌన్లవానీకుంట ఆక్రమణలకు గురయ్యే ప్రమాదం ఉందని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. కుంటకు సంబంధించిన భూమిని సర్వే చేయించి స్పష్టమైన హద్దులు ఏర్పాటు చేయడంతో పాటు చుట్టూ బౌండరీ నిర్మాణం చేపట్టి ప్రభుత్వ ఆస్తిని పరిరక్షించాలని కోరుతూ వార్డు ప్రజల తరఫున వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రాన్ని స్వీకరించిన



తహసీల్దార్ గడ్డం సుధాకర్ సమస్యను పరిశీలించి త్వరలోనే సంబంధిత అధికారులను, ఎంసీ బృందాన్ని పంపించి సర్వే నిర్వహించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. తహసీల్దార్ సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారానికి హామీ ఇవ్వడంపై కౌన్సిలర్ యాట్ల సునీత అశోక్ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. గౌన్లవానీకుంటను ఆక్రమణల నుంచి కాపాడి భవిష్యత్ తరాలకు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు



కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ అసెంబ్లీ సెక్రటరీ రోమాల రాజ్‌కుమార్, జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు దాసరి రామ్మూర్తి, శివమణి అక్షయ్ తదితరులు పాల్గొన్నారు. తహసీల్దార్‌ను కలిసి అభినందనలు తెలియజేస్తూ ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.

## ఎలబాక గ్రామ లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కు పంపిణీ

**కరపత్రం ప్రతినిధి వీణవంక, జూలై 3:**
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి పథకం కింద వీణవంక మండలంలోని ఎలబాక గ్రామానికి చెందిన పుల్లూరి అనిత -- ప్రసాద్ దంపతులకు మంజూరైన ఆర్థిక సహాయ చెక్కును తహసీల్దార్ ముద్దసాని రమేష్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్



మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పేద మరియు మధ్యతరగతి కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో కళ్యాణ లక్ష్మి పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబం ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఎండీ సాహెబ్ హుస్సేన్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్, డైరెక్టర్ నల్లగొని సతీష్ తదితరులు పాల్గొని లబ్ధిదారులను అభినందించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని వారు పేర్కొన్నారు. లబ్ధిదారుల కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి, సంబంధిత అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్తులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొరపల్లి గ్రామంలో యూనియన్ బ్యాంక్ బీసీ పాయింట్ ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న వార్డు సభ్యులు బండారి ప్రశాంత్

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జూలై 3:**
గ్రామీణ ప్రజలకు బ్యాంకింగ్ సేవలను మరింత చేరువ చేసే లక్ష్యంతో కొరపల్లి గ్రామంలో యూనియన్ బ్యాంక్ బీసీ (బ్యాంకింగ్ కరస్పాండెంట్) పాయింట్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వెంకటేశ్వర్లపల్లి గ్రామ పంచాయతీ 3వ వార్డు సభ్యులు బండారి ప్రశాంత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ప్రారంభమైన బీసీ పాయింట్ నిర్వాహకులు ఈర్ల దివ్య రమేష్ ను శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. గ్రామ ప్రజలకు అవసరమైన బ్యాంకింగ్ సేవలను స్థానికంగానే అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాట్లాడిన బండారి ప్రశాంత్, గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవల విస్తరణలో బీసీ పాయింట్లు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. వృద్ధులు, రైతులు, మహిళలు, విద్యార్థులు, అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులు నగదు జమ, నగదు ఉపసంహరణ, ఖాతా వివరాల పరిశీలన, ఆధార్ ఆధారిత బ్యాంకింగ్ సేవలు తదితర సౌకర్యాలను తమ గ్రామంలోనే సులభంగా పొందగలరని తెలిపారు. ప్రజలు బ్యాంకులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సమయం, ప్రయాణ ఖర్చు ఆదా అవుతుందని, డిజిటల్ బ్యాంకింగ్ సేవలను మరింత విస్తృతంగా వినియోగించుకునే అవకాశం కలుగుతుందని చెప్పారు. గ్రామ ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక లావాదేవీలను సులభతరం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో



యూనియన్ బ్యాంక్ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, యువకులు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మాటకు విలువ... కార్యకర్తలకు భరోసా...

– కష్టకాలంలో అండగా వ్యాల్ల హరీష్ రెడ్డి

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని జూలై 03:**
రెండు రోజుల క్రితం అనారోగ్యంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గోదావరిఖని ఎన్‌టీపీసీ పట్టణానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు సోమిడి రాముని పరామర్శించిన సందర్భంగా "అవసరమైతే అండగా ఉంటాను" అని హామీ ఇచ్చిన బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, రామగుండం నియోజకవర్గం వ్యాల్ల హరీష్ రెడ్డి, నేడు తన మాటను నిలబెట్టుకుంటూ వారి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందించారు. కష్టకాలంలో పార్టీ కార్యకర్తలకు అండగా నిలుస్తూ తన బాధ్యతను మరోసారి చాటుకున్న హరీష్ రెడ్డిని స్థానికులు, పార్టీ శ్రేణులు అభినందించారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగ అధికార ప్రతినిధి బూరుగు వంశీకృష్ణ, కొండా సురేష్, ఎండి. నిజాం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లందకుంట నూతన తహసీల్దార్ మనోజ్ కుమార్‌కు ఘన సన్మానం

దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు మర్యాదపూర్వక భేటీ

**కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట, జూలై 3:**
ఇల్లందకుంట మండలానికి నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన మనోజ్ కుమార్‌ను శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి, దేవస్థానం జ్ఞాపిక (మెమెంటో)తో పాటు ముత్యాల తలంబ్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇంగిలే రామారావు మాట్లాడుతూ, మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. ముఖ్యంగా



విద్యార్థుల సౌకర్యార్థం కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలను త్వరితగతిన జారీ చేసి వారికి ఇబ్బందులు కలగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రభుత్వ సేవలను పారదర్శకంగా, సమర్థవంతంగా అందిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. తహసీల్దార్ మనోజ్ కుమార్ మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన పరిపాలన అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు సకాలంలో చేరేలా చర్యలు తీసుకుంటానని, ప్రజా సమస్యల పరిష్కారంలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ధర్మకర్తలు గొడిశాల పరమేష్, గోలి కిరణ్, యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గుండారపు సాయి తదితరులు పాల్గొన్నారు. నూతన తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన సేవలు మండల అభివృద్ధికి దోహదపడాలని ఆకాంక్షించారు.

## వట్టెంలలో 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్.. మర్రిపల్లిలో నూతన బ్రేకర్ ఏర్పాటు

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
వేములవాడ రూరల్ సెక్షన్ పరిధిలో విద్యుత్ మౌలిక సదుపాయాల బలోపేతానికి మరో కీలక అడుగు పడింది. వట్టెంల సబ్‌స్టేషన్‌లో 3.15 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని 5 ఎంవీఏకు పెంచగా, మర్రిపల్లి సబ్‌స్టేషన్‌లో నూతన బ్రేకర్‌ను శుక్రవారం టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆధునికీకరణతో విద్యుత్ సరఫరా వ్యవస్థ మరింత పటిష్ఠమై, పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించే అవకాశం ఏర్పడిందని, విద్యుత్ అంతరాయాలు గణనీయంగా తగ్గి, వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందనున్నాయని అలాగే లోపాలను త్వరితగతిన గుర్తించి, విద్యుత్ అంతరాయాలను సమర్థవంతంగా నియంత్రించేందుకు ఈ పనులు దోహదపడనున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ వేణుమాధవ్, డీఈలు వెంకట రమణ, చంద్రమౌళి, ఏడీఈ గంగాధర్, ఏఈ జొర్రీగ స్రవంతి, ఏడీఈ (సీఓ) రాజా లింగు, ఏఈ (సీఓ) శ్రీనివాస్ రెడ్డి, ఏడీఈ (టీఆర్ఈ)తో పాటు విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక
శనివారం జూలై 04, 2026

# ఉద్యమ కళాకారుల సమస్యల పరిష్కారానికి మంత్రి జూపల్లికి వినతి



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ప్రజా పాలన కార్యక్రమంలో సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును తెలంగాణ ఉద్యమ కళాకారుల విభాగం రాష్ట్ర కన్వీనర్ యెల్ల పోశెట్టి గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యమ కళాకారుల సేవలను గుర్తించి అర్హులకు సాంస్కృతిక సారథిలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి జూపల్లి కృష్ణారావు, ఈ అంశాన్ని త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చీమ శ్రీనివాసరావు, పటోళ్ల సురేందర్ రెడ్డి, వెంగళ భాస్కర్, వెన్నమల్ల వెంకటేష్, ఆర్కే భూపాల్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# వివేకానంద ఆశయాలతో యువత ముందుకు సాగాలి

- 56వ డివిజన్ బీజేపీ మాజీ అధ్యక్షులు మందొటి మహేందర్ పటేల్

**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూలై 3**
జూలై-4 భారతీయ ఆధ్యాత్మికత, దేశభక్తి, యువజన చైతన్యానికి ప్రతీకగా నిలిచిన స్వామి వివేకానంద వర్ధంతి సందర్భంగా 56వ డివిజన్ బీజేపీ మాజీ అధ్యక్షులు మందొటి మహేందర్ పటేల్, స్వామి వివేకానంద ను ఘనంగా స్మరించుకొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహేందర్ పటేల్ మాట్లాడుతూ.. స్వామి వివేకానంద బోధనలు నేటి యువతకు శాశ్వత స్ఫూర్తినిచ్చే మార్గదర్శకాలుగా నిలుస్తున్నాయని అన్నారు. యువతలో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, సేవా దృక్పథం, దేశభక్తి వంటి గొప్ప విలువలను పెంపొందించడంలో ఆయన సందేశాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. భారతీయ సంస్కృతి, సనాతన ధర్మం, మానవతా విలువలను ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడిగా స్వామి వివేకానంద చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. విద్యార్థులు విద్యను కేవలం ఉద్యోగ సాధనంగా కాకుండా వ్యక్తిత్వ వికాసానికి, సమాజ సేవకు ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రతి యువకుడు తనలోని అపారమైన శక్తి, సామర్థ్యాన్ని గుర్తించి లక్ష్యసాధన దిశగా నిరంతరం శ్రమించాలని పిలుపునిచ్చారు. "లేవండి... మేల్కొనండి... లక్ష్యాన్ని చేరుకునే వరకు విశ్రమించకండి", "బలమే జీవితం... బలహీనతే మరణం" అనే స్వామి వివేకానంద సందేశాలు ప్రతి ఒక్కరి జీవితానికి మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూనే భారతీయ సంస్కృతి, నైతిక విలువలను పరిరక్షించే బాధ్యత యువతపై ఉందని పేర్కొన్నారు. విలువలతో కూడిన విద్య, సేవాభావం, దేశాభివృద్ధి పట్ల అంకితభావంతో కూడిన యువతే వికసిత భారత నిర్మాణానికి బలమైన పునాదిగా నిలుస్తుందని మహేందర్ పటేల్ తెలిపారు.

# దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తిని భావితరాలు ఆదర్శంగా తీసుకోవాలి

- భూమి కోసం.. భుక్తి కోసం.. వెట్టి చాకిరి విముక్తి కోసం సాగిన పోరాటానికి దొడ్డి కొమురయ్య చిరస్మరణీయం
- 15వ వార్డు బీజేపీ అధ్యక్షులు ల్యాదెళ్ల ప్రభాకర్

**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూలై 3**
తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి-జూలై 4 సందర్భంగా 15వ వార్డు బీజేపీ అధ్యక్షులు ల్యాదెళ్ల ప్రభాకర్, స్వామి వివేకానంద సేవలను, పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి నిర్మూలన కోసం నిరంకుశ పాలనను, దొరల దౌర్జన్యాలను ధైర్యంగా ఎదిరించి ప్రాణత్యాగం చేసిన దొడ్డి కొమురయ్య తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన మహనీయుడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా15వ వార్డు బిజెపి అధ్యక్షులు ప్రభాకర్ మాట్లాడుతూ.. దొడ్డి కొమురయ్య పోరాటం కేవలం రైతాంగ హక్కులకే పరిమితం కాలేదని, సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవం, అణగారిన వర్గాల విముక్తి కోసం సాగిన చారిత్రాత్మక ఉద్యమానికి ప్రతీకగా నిలిచిందన్నారు. వెట్టి చాకిరి వంటి అమానవీయ వ్యవస్థలకు వ్యతిరేకంగా ఆయన ప్రదర్శించిన ధైర్యసాహసాలు తెలంగాణ సమాజానికి చిరస్మరణీయమని కొనియాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం సామాన్య ప్రజల స్వేచ్ఛ, గౌరవప్రదమైన జీవనం, సమాన హక్కుల సాధన కోసం సాగిన గొప్ప ప్రజా ఉద్యమమని పేర్కొన్న ఆయన, అలాంటి మహనీయుల త్యాగాలను, ఆశయాలను భావితరాలకు చేరవేయడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. నేటి యువత దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి కృషి చేయాలని ప్రభాకర్ పిలుపునిచ్చారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడమే కాకుండా, వారు కలలు కన్న సమానత్వ సమాజ నిర్మాణ దిశగా అడుగులు వేయడమే వారికి అర్పించే నిజమైన నివాళి అని ప్రభాకర్ పేర్కొన్నారు.

# 1వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా చిర్ర రామన్న గౌడ్

» పార్టీ బలోపేతానికి కృషి చేస్తా: చిర్ర రామన్న గౌడ్

**కరపత్రం ప్రతినిధి హనుమకొండ, జూలై 3**
గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ముచ్చర్ల గ్రామానికి చెందిన చిర్ర రామన్న గౌడ్ నియమితులయ్యారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీ-పీసీసీ) అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ సందర్భంగా చిర్ర రామన్న గౌడ్ మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, 1వ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలతో సమన్వయంగా పనిచేస్తానని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, పార్టీ అభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తానని పేర్కొన్నారు.
తన నియామకానికి సహకరించిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్ రాంరెడ్డి, హనుమకొండ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దిలీప్ రాజు, అలాగే 1వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు అయిత మహేష్‌కు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి నివాళి

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జూలై 3:**
జమ్మికుంట ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు శ్రీ అయిత మహేష్ మృతిపట్ల హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళు లర్పించి, అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అయిత మహేష్ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ఆర్యవైశ్య సంఘ అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. ఆయన మరణం జమ్మికుంట పట్టణానికి, ఆర్యవైశ్య సమాజానికి తీరని లోటని పేర్కొన్నారు. ఈ దుఃఖ సమయంలో కుటుంబ సభ్యులకు ధైర్యం ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ పోల్నేని సత్యనారాయణరావు, కెడీసీసీబీ బ్యాంకు ఉపాధ్యక్షుడు పింగిలి రమేష్, జమ్మికుంట మున్సిపాలిటీ మాజీ చైర్మన్లు తక్కల్లపల్లి రాజేశ్వరరావు, పొడేటి రామస్వామి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ పొనగంటి సంపత్, కౌన్సిలర్లు చింతల శ్రీనివాస్,





చందర్ రాజు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు లెంకలపల్లి శరత్ కుమార్ తదితరులు పాల్గొని నివాళు లర్పించారు. పలువురు నాయకులు, సంఘ ప్రతినిధులు, వ్యాపార వర్గాల ప్రముఖులు అయిత మహేష్ సేవలను స్మరించుకుంటూ ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు

# తెరిచిన మ్యాన్ హోల్స్..



- తవ్విన రోడ్లు.. ప్రజల ప్రాణాలతో చెలగాటం.

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని జూలై 03:**
రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేదరబస్తీ--శివాజీనగర్ ప్రధాన మార్కెట్‌కు వెళ్లే రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. తెరిచి ఉన్న మ్యాన్‌హోల్స్, తవ్వి వదిలేసిన రోడ్లు, వర్షపు నీటితో నిండిన గుంతల కారణంగా నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేదరబస్తీ--శివాజీనగర్ ప్రధాన మార్కెట్‌కు వెళ్లే రహదారి అధ్వాన్నంగా మారి ప్రజలకు నిత్యం ప్రమాదాలను ఆహ్వానిస్తోంది. రోడ్డంతా భారీ గుంతలు, తెరిచి ఉన్న మ్యాన్‌హోల్స్, తవ్వి వదిలేసిన ప్రాంతాలతో ప్రయాణం దుర్భరంగా మారింది. వర్షపు నీటితో గుంతలు నిండిపోవడంతో వాటి లోతు కనిపించక ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శివాజీనగర్ మార్కెట్ రామగుండంలోని ప్రధాన కూరగాయలు, చేపలు, చికెన్, మటన్ మార్కెట్ కావడంతో ప్రతిరోజూ వందలాది మంది ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటారు. అయితే రహదారి పూర్తిగా దెబ్బతిన్నప్పటికీ సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. కొన్నిచోట్ల మ్యాన్‌హోల్స్‌కు మూతలు లేకపోవడం, మరికొన్ని చోట్ల తవ్విన రోడ్లను అలాగే వదిలేయడంతో చిన్నపిల్లలు, వృద్ధులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానికుల కథనం ప్రకారం, దాదాపు ప్రతిరోజూ ఈ రహదారిపై చిన్నచిన్న ప్రమాదాలు జరుగుతున్నాయి. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారి, గుంతలు నీటితో నిండిపోవడంతో ప్రమాదాల సంఖ్య పెరుగుతోందని వారు చెబుతున్నారు. అత్యవసర సేవల వాహనాలు కూడా ఈ మార్గంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొంటున్నారు. పట్టణ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ నిధులు తీసుకొస్తున్నప్పటికీ, స్థానిక స్థాయిలో అభివృద్ధి పనుల అమలులో నిర్లక్ష్యం కనిపిస్తోందని ప్రజలు విమర్శిస్తున్నారు. రహదారి దుస్థితి చూస్తే అభివృద్ధి పనుల నాణ్యతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయని అంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి, రహదారిని పూర్తిస్థాయిలో పునరుద్ధరించడంతో పాటు తెరిచి ఉన్న మ్యాన్‌హోల్స్‌కు మూతలు ఏర్పాటు చేసి ప్రజలకు సురక్షితమైన రాకపోకలు కల్పించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# నాయిని చెరువు కట్టపై నీటి నిల్వ తొలగింపు -- మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్వామికి కౌన్సిలర్ విష్ణువర్ధన్ కృతజ్ఞతలు తెలిపారు

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జూలై 3:**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని నాయిని చెరువు కట్టపై ఇటీవల ఎల్ఈడీ లైట్లు, క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయడంతో పాటు కట్ట మరమ్మతులలో భాగంగా బతుకమ్మ ఘాట్ నిర్మాణం, చెరువు చుట్టూ వెంచర్ మాదిరిగా మొరము పోసి లెవెలింగ్ పనులు చేపట్టడం జరిగింది. ఈ అభివృద్ధి పనులతో నాయిని చెరువు కట్ట ప్రాంతం ప్రజలకు మరింత ఉపయోగకరంగా మారింది. అయితే ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా చెరువు కట్టపై నీరు నిల్వ ఉండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా మోతుకులగూడెం, మాచనపల్లి గ్రామాల ప్రజలు ఈ కట్టపైనే రాకపోకలు సాగిస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. క్రీడా ప్రాంగణాన్ని వినియోగించే యువతకు కూడా సమస్యలు తలెత్తాయి. ఈ విషయాన్ని గుర్తించిన 11వ వార్డు కౌన్సిలర్ పొనగంటి విష్ణువర్ధన్ వెంటనే మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్వామి కి ఫోన్ ద్వారా సమాచారం అందించి, నీటి నిల్వను తొలగించేందుకు జేసీబీ పంపించాలని కోరారు.



కౌన్సిలర్ విజ్ఞప్తికి తక్షణమే స్పందించిన కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించి జేసీబీని పంపించారు. జేసీబీ సహాయంతో చెరువు కట్టపై నిల్వ ఉన్న నీటిని తొలగించి ప్రజల రాకపోకలకు మార్గాన్ని సుగమం చేశారు. దీంతో మోతుకులగూడెం, మాచనపల్లి గ్రామాల ప్రజలు, క్రీడాకారులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ పొనగంటి విష్ణువర్ధన్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో ఎప్పటికప్పుడు స్పందిస్తూ అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్న మున్సిపల్ కమిషనర్



మల్లికార్జున స్వామి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# మహిళా సాధికారతకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లే బలం

తంగళ్ళపల్లిలో ఇందిరా మహిళా శక్తి కింద 2 స్వయం ఉపాధి యూనిట్ల ప్రారంభం

**కరపత్రం ప్రతినిధి రాజన్న సిరిసిల్ల**
రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండల కేంద్రంలో ఇందిరా మహిళా శక్తి పథకం కింద మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వెంకటసాయి కోల్డ్ ప్రెస్ ఆయిల్ అండ్ ఫ్లోర్ మిల్, కోవిదా మిల్క్ పాయింట్ యూనిట్లను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం యూనిట్లను పరిశీలించి వాటి పనితీరు, ఉపాధి, ఆదాయం తదితర వివరాలను మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. కోల్డ్ ప్రెస్ ఆయిల్, పిండి గిర్నితో పాటు మరో ఆరు యంత్రాలతో ఏర్పాటు చేసిన యూనిట్‌ను సుమారు రూ.11.50 లక్షల వ్యయంతో ఏర్పాటు చేశారని తెలిపారు. దీనికి పీఎంఎఫ్ఎంఈ పథకం కింద రూ.3.50 లక్షల సబ్సిడీ లభిస్తుందని వెల్లడించారు. మరో మహిళా సంఘం ఆధ్వర్యంలో డెయిరీ యూనిట్‌ను ఏర్పాటు చేయగా, ఇందుకోసం మహిళా సంఘాల ద్వారా రూ.5 లక్షల రుణం అందించామని తెలిపారు. ఈ కేంద్రంలో పాలు, పెరుగు, నెయ్యి తదితర డెయిరీ ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని చెప్పారు. జిల్లాలో మరిన్ని మహిళా సంఘాలు ఫుడ్ ప్రాసెసింగ్, డెయిరీ వంటి స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటు దిశగా ముందుకు రావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఇలాంటి యూనిట్లు మహిళలకు ఉపాధి కల్పించడమే కాకుండా వారి ఆర్థిక స్వావలంబనకు, మహిళా సాధికారతకు బలంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఇటీవల నిర్వహించిన బ్యాంకర్ల సమావేశంలో మహిళా



సంఘాలకు రుణాల మంజూరుపై ప్రత్యేక ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల మహిళలు, యువతకు సిరిసిల్లలో ఆర్‌సెటీ ఆధ్వర్యంలో ఉచిత వసతి సౌకర్యంతో శిక్షణలు అందుబాటులో ఉన్నాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి రంగంలో రాణించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ మల్లికార్జునరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ నర్సింగం, ఇన్‌చార్జి తహసీల్దార్ మురళి, ఇన్‌చార్జి ఎంపీడీఓ రమేష్, ఎంపీఓ మీర్జా, సర్పంచ్ లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.